క్లుప్తంగా

సురక్షా దినోత్సవానికి తరలిరండి



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న సీఐ

టేకులపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 4న జిల్లా కేంద్రంలోని హేమచంద్రాపురం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సాయంత్రం 4 గంటలకు జరగనున్న తెలంగాణ పోలీస్ సురక్షా దినోత్సవ వేడుకలకు హాజరు కావాలని టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రమణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం రాత్రి పోలీసు స్టేషన్ ఆవరణలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రముఖ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని పోలీసు సేవలు మరింత బలోపేతం అయ్యేందుకు కృషి చేయాలని కోరారు.

రైలు ప్రమాదానికి కేంద్రమే బాధ్యత వహించాలి

పాల్వంచ: ఒడిషాలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జిల్లా కమిటీ సమావేశాన్ని తోడేటి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని, రైల్వేలో క్రమంగా ప్రైవేటీకరణ పెంచేందుకు కుట్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ కోసం ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థల పట్ల ప్రభుత్వం వ్యాపార ధోరణితో ప్రైవేట్ విధానాలను చేపడుతోందని విమర్శించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గొని నాగేశ్వరరావు, ఎస్.సంజీవ్, మల్లికార్జున్‌రావు, ప్రసాద్, వెంకన్న, మల్లయ్య, నరసింహారావు, పుష్పరాజు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏం సాధించారని రైతు సంబురాలు?



సుజాతనగర్: మాట్లాడుతున్న కామేష్

సుజాతనగర్: రైతులకు ఏం ఒరగ బెట్టారని రైతు సంబరాలు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వానికి రైతు సంబరాల మీద ఉన్న శ్రద్ధ పట్టాల పంపిణీలో లేదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ విమర్శించారు. శనివారం పార్టీ శ్రేణులతో కలిసి మండలంలోని సర్వారం గ్రామ పంచాయతీలో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులందరికీ ఉచితంగా ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీ చేసి ప్రభుత్వ బ్యాంకుల ద్వారా కొత్త రుణాలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. రైతులకు గుదిబండగా మారిన ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రైతుబంధు అందించాలని, 60 సంవత్సరాలు దాటిన రైతులు చనిపోతే వారికి కూడా రైతు బీమా వర్తింపజేయాలన్నారు. గంధం మల్లికార్జునరావు, పాయం శారద, భీముడు, కస్నా, బిక్కులాలు, రాహుల్, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తొమ్మిదేళ్లుగా మాటలతో కాలం వెళ్లబుచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఏం చేసిందని నేడు ఉత్సవాలు నిర్వహిస్తోందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ ప్రశ్నించారు. బీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి పేరుతో పేదల నోట్లో మట్టికొట్టి అప్పగించారని ఆరోపించారు. సమావేశంలో లేతాకుల కాంతారావు, రాయల శ్రీనివాసరావు, పప్పుల గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రైతువేదికల వద్ద సందడి
- ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు
- అన్నదాతలకు సన్మానం



కొత్తగూడెంఅర్బన్: సన్మానం పొందిన రైతులతో చైర్‌పర్సన్ సీతాలక్ష్మి, ప్రజాప్రతినిధులు

చుంచుపల్లి: ప్రశాంతినగర్ గ్రామపంచాయతీలోని రైతు వేదికలో శనివారం తెలంగాణ రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పలు గ్రామాల నుంచి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా గ్రామస్తులు మేళతాళాలతో భారీ ర్యాలీగా రైతు వేదికకు తరలివచ్చారు. గౌతంపూర్ నుంచి వచ్చిన మహిళల కోలాటం బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం అధికారులు రైతు వేదిక సభాస్థలి వద్ద జాతీయ గీతం ఆలపించి, ప్రభుత్వ సందేశం చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు సన్మానం చేశారు. ఎంపీపీ బాదావత్ శాంతి, జెడ్పీ సీఈఓ మెరుగు విద్యాలత, తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్, ఎంపీడీఓ ఎం.మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ, ఏఓ బి.రాజేశ్వరి, ఏఈఓ మమత, ఎంపీటీసీలు రుక్మిణి, ముక్తి సరస్వతి, ఆర్తి



టేకులపల్లి: ప్రెగళ్లపాడులో ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే హరిప్రియ



బోడులో ఎంపీడీఓ ఆధ్వర్యంలో రైతు ర్యాలీ

మక్కడ్, సర్పంచులు పద్మ, శ్రీను, కాశీ విశ్వనాథ్, గుమ్మడి సాగర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణ పరిధి గంగబిషన్ బస్తీలో రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని రైతులను సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలలో రైతు దినోత్సవం సందర్భంగా రైతులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపతి అని, వారి సంక్షేమ కొరకు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు శర్మ, వార్డు కౌన్సిలర్లు బాలిశెట్టి సత్యభామ, వేణు, బండి నర్సింహా, అనిల్, మున్సిపల్, తహసీల్దారు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: పాయకారియానంబైల్ గ్రామంలోని రైతువేదికలో శనివారం దశాబ్ది ఉత్సహాల సందర్భంగా రైతు సదస్సు నిర్వహించారు. రైతుబంధు మండల కోఆర్డినేటర్ కిలారు నాగేశ్వరరావు, రైతులు కృష్ణ, అనిల్, వెంకటేశ్వర్లును శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీఓ బి.నారాయణ, ఏఈఓ విజయభాను, సర్పంచ్‌లు శెట్టిపల్లి సుగుణ, కొర్ర అర్జున్‌రావు, తేజావత్ సక్రు, సొసైటీ డైరెక్టర్ కనగాల నారాయణ పాల్గొన్నారు. బంజర, పాండురంగాపురం గ్రామంలో జరిగిన రైతు సదస్సులో జెడ్పీటీసీ వాసుదేవరావు, సర్పంచ్ నరేష్, కార్యదర్శి రణధీర్, అధికారులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవ వేడుకలను రైతు వేదికల్లో ఘనంగా జరుపుకున్నారు. రైతులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. రైతులతో నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్యా సోనీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, తహసీల్దార్ శారద, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, వ్యవసాయ అధికారి ఎస్ రఘుదీపిక, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

టేకులపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం టేకులపల్లి మండలంలోని గంగారం, బోడు, చుక్కాలబోడు, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, ప్రెగళ్లపాడు రైతు వేదికల్లో ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అన్ని రైతు వేదికల వద్దకు రైతులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో వచ్చారు. కోలాట నృత్యాలు, ఆట పాటలతో భారీ ర్యాలీలు నిర్వహించారు. ప్రతి రైతు వేదిక వద్ద వెయ్యి మంది రైతుల సమీకరణ లక్ష్యంగా అధికారులు రైతులు, ప్రజలను తరలించారు. బోడు, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, ప్రెగళ్లపాడు రైతు వేదికల్లో జరిగిన కార్యక్రమాల్లో ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ పాల్గొన్నారు. ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే స్వయంగా ట్రాక్టర్ నడిపి రైతు వేదికకు చేరుకున్నారు. వేదికల వద్ద హాజరైన వందలాది మంది రైతులకు భోజనం ఏర్పాటు చేశారు. గంగారంలో ఆదర్శ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, ఏడీఏ వాసవీ రాణి, తహసీల్దార్ వీరభద్రం, ఎంపీడీఓ కోట వీరబాబు, ఏఓ అన్నపూర్ణ, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఎంపీఓ గణేష్ గాంధీ, ఏఈఓలు శ్రావణి, భాగ్యశ్రీ, విశాల, రమేష్, రెహానా, స్పెషలాఫీసర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: రైతుకు సన్మానం చేస్తున్న అధికారులు



టేకులపల్లి: రైతు వేదిక వద్ద భోజనాలు



చుంచుపల్లి: ప్రశాంతినగర్‌లో రైతు వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ బాదావత్ శాంతి, జెడ్పీ సీఈఓ విద్యాలత



జూలూరుపాడు: కాకర్లలో ఎడ్ల బండ్లతో ర్యాలీ..



మాచినేనిపేటతండాలో ర్యాలీగా వస్తున్న రైతులు



జూలూరుపాడు: పడమటనర్సాపురంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ కళావతి



సురారం నుంచి బైక్‌లపై బయలుదేరిన రైతులు



టేకులపల్లి: గంగారంలో ఆదర్శ రైతులకు సన్మానం

ప్రధాని మోదీ స్పందించాలి



సింగరేణి(కొత్తగూడెం): కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఇఫ్టూ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల నిందితుడు ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట జాతీయ కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) ఆధ్వర్యంలో నోటికి నల్లరిబ్బన్లు, చేతిలో నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి మాట్లాడుతూ.. 2016 నుంచి బ్రిజ్ భూషణ్ మహిళా రెజ్లర్లను వేధింపులకు గురిచేస్తున్నాడని, పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, ఆయనను విధుల నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయంగా క్రీడల్లో దేశకీర్తిని ప్రపంచమంతా చాటిచెబుతున్న మహిళా క్రీడాకారుల మనోవేధనను ఆలకించి వెంటనే ఎంపీని అరెస్ట్ చేసి జైలుకు పంపించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు గొని నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి నెమళ్ల సంజీవ్, మోత్కూరి మల్లికార్జున్‌రావు, తోడేటి నాగేశ్వరరావు, వీరమల్ల ఉమ, యాసారపు వెంకన్న పాల్గొన్నారు.

ఇల్లెందు: బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ లైంగికంగా వేధించాడని తమకు న్యాయం చేయాలని 45 రోజులుగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా రెజ్లర్ల పట్ల పోలీసులు అత్యంత పాశవికంగా వ్యవహరించారని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ఏ నబీ ఆరోపించారు. శనివారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ తక్షణం స్పందించాలని కోరారు. ఈ నెల 12న ఆశా వర్కర్ల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ఆందోళన ఉంటుందని విజయవంతం చేసేందుకు ఆశా కార్యకర్తలు సమాయత్తం కావాలని కోరారు. సమావేశంలో శంకర్, అబ్బాస్, మరియ, చందర్, సత్యనారాయణ, భద్రు, రాము, శ్రీను పాల్గొన్నారు.

బడిబాట ర్యాలీ



నాగారం కాలనీలో ర్యాలీలో విద్యార్థులు, టీచర్లు

పాల్వంచరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించేందుకు శనివారం మండల పరిధిలోని నాగారం కాలనీ, సోములగూడెం గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, హెచ్ఎం .హరి, ఉపసర్పంచ్ ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ కృష్ణకుమారి, టీచర్ సుజాత పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న జమలయ్య

సింగరేణి(కొత్తగూడెం): అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ సమయంలో రూ.15 లక్షలతో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెం జిల్లా పరిధిలోని ఎస్‌కే నగర్ గ్రామ పంచాయతీలోని కమ్మ సత్రంలో అంగన్‌వాడీ ప్రాజెక్ట్ సమావేశం జరిగింది. మాట్లాడుతూ... అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని, అంగన్‌వాడీల మనోవేదనను దెబ్బతీసే విధంగా అంగన్‌వాడీ కోడిగుడ్లపై ఐసీడీసీ లోగోను ముద్రించడం సరైంది కాదన్నారు. ఈ విధానాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అభియాన్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని, ప్రతినెల 10వ తేదీలోపు వారి బిల్లులు వారి అకౌంట్‌లో వేయాలని విజ్ఞప్తి చేశారు. వాసిరెడ్డి మురళి, గోనె మణి, ప్రమీల, సరోజ, కళావతి, జానకి, రామలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సర్కారు పాఠశాలల్లో చదివించండి

పాల్వంచరూరల్: ఇంటింటికి తిరిగి విద్యార్థులను, తల్లిదండ్రులను కలిసి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించేలా చైతన్యం కల్పించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, జిల్లా సెక్టోరియల్ అధికారి ఎస్‌కే.సైదులు కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం జగన్నాథపురం, తోగ్గూడెం గ్రామాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య, ఉచితంగా యూనిఫాం, నోటుపుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరామ్మూర్తి, జగన్నాథపురం హైస్కూల్ హెచ్ఎం బి.ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమం శనివారం మండలంలో ప్రారంభించారు.

ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ తమ పాఠశాలలోని ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు గురించి వివరిస్తూ పిల్లలను చేర్పించాలని కోరుతున్నారు. హెచ్ఎం బానోతు లక్ష్మా, వాసం భాస్కర్‌రావు, పద్మ, నర్సింహారావు, సుడిగాలి వెంకన్న, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ విజయోత్సవ సంబురాలు

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా వైరా పరుచూరి గార్డెన్స్‌లో సోమవారం విద్యుత్ విజయోత్సవ సంబురాలు నిర్వహించనున్నట్లు జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు ప్రజాప్రతినిధులు, విద్యుత్ వినియోగదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయ పోస్టులకు ఆహ్వానం

పాల్వంచ: పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ ఎస్‌కే నబీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటి సోషల్ స్టడీస్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, బీఎడ్‌తో పాటు సంబంధిత సబ్జెక్ట్‌లో కనీసం 3 సంవత్సరాల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను జూన్ 8వ తేదీ నాటికి పాఠశాలలో సమర్పించాలని, వివరాలకు 7331170862 నంబర్‌లో సంప్రదించాలిని కోరారు.

పాఠ్యపుస్తకాలొచ్చాయి..

టేకులపల్లి: మండలంలోని ప్రభుత్వ మండల, జిల్లా పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ఈ మేరకు శనివారం ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు పుస్తకాలను పంపిణీ చేశారు. 1–10 తరగతులకు గాను మండలానికి 25వేల పుస్తకాలు రావాల్సి ఉండగా.. ప్రస్తుతం 12వేలు మాత్రమే వచ్చాయి. తరగతుల వారీగా అన్ని సబ్జెక్టుల పుస్తకాలు కూడా రాలేదు. మిగిలిన పుస్తకాలు కూడా త్వరలోనే వస్తాయని ఎంఈఓ శనివారం తెలిపారు.

ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా రాంప్రసాదరావు



కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీఎస్ ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా పాల్వంచకు చెందిన న్యాయవాది అనుబ్రోలు రాంప్రసాదరావు నియమితులయ్యారు. ఈమేరకు ఆర్టీసీ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని విందు, వినోదాలు, జల్సాలతో అమరుల కల నెరవేరదని, సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలను విస్మరించారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు విమర్శించారు. ప్రజాపంథా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. అంతకు ముందు కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కమిటీ ముద్రించిన ప్రజా ఆకాంక్ష దీక్షా దివస్ కరపత్రాలను విడుదల చేశారు. పలువురు మాట్లాడుతూ.. కోటి ఆశలతో విద్యార్థులు యువకులు, సకల జనులు కలిసి కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో తమ ఉద్యోగాలు తమకు వస్తాయని, విద్యారంగం కార్పొరేట్ నీడను వీడి బయటకు వస్తుందనుకున్న నిరుద్యోగ యువత ఆశలు అడియాశలయ్యాయన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సింగరేణి(కొత్తగూడెం): కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు



ఇల్లెందు: మాట్లాడుతున్న చంద్ర అరుణ



సుజాతనగర్: కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రజాపంథా నాయకులు



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి నాయిని రాజు

ప్రభుత్వం ఇస్తే.. మీరు లాక్కుంటారా?

టేకులపల్లి: 2018లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మొక్కంపాడు పేరుతో నూతన గ్రామ పంచాయతీని ఏర్పాటు చేస్తే దాన్ని మొక్కంపాడుతండా వాసులు లాక్కోవాలని చూస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని మొక్కంపాడు వార్డు సభ్యులు చింత భద్రయ్య, బిజ్జ జయసుధ, కుంజా రాఘవ, గ్రామ పెద్దలు కుంజా వెంకటేశ్వర్లు, ఈసం అంజయ్య, బిజ్జ రామయ్య అన్నారు. ఈ మేరకు శనివారం టేకులపల్లి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఉమ్మడి బోడు పంచాయతీలో ఉన్న మొక్కంపాడు (ఆదివాసీల గుంపు), మొక్కంపాడుతండా (లంబాడీల తండా) రెండు గ్రామాలను కలిపి మొక్కంపాడు పేరుతో నూతన పంచాయతీ ఏర్పాటు చేసిన తరువాత ఇక్కడే అద్దె ఇంట్లో పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేసి కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. తండా కంటే ముందుగానే తమ గ్రామం ఏర్పడిందన్నారు. మొక్కంపాడుకి 3, తండాకు 5 వార్డులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం సర్పంచ్, ఉప సర్పంచ్, నలుగురు వార్డు సభ్యులు తండా వాసులేనని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జీపీ కార్యాలయం తండాలో పెట్టుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నాలుగు సీసీ రోడ్లకు రూ.20 లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేస్తే వాటిని తండాలోనే వేసుకున్నారని విమర్శించారు. పంచాయతీకి 20 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేస్తే తండాకు 11 తీసుకుని మొక్కంపాడుకి 9 మాత్రమే కేటాయించారని ఆరోపించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు కూడా ఏకపక్షంగా తండాలో జీపీ ఆఫీసు ఏర్పాటు చేసుకుని సర్పంచ్, ఉప సర్పంచ్, ఉదయమే జెండా ఎగురవేయడం ఏమిటని, కార్యదర్శి, మొక్కంపాడు గ్రామస్తులు పదేపదే ఫోన్ చేస్తే పదిన్నర గంటలకు మొక్కంపాడుకు వచ్చి జెండా ఎగురవేశారని ఆరోపించారు. రెండు గ్రామాల సమస్యను పరిష్కరించుకుందామని ఎంపీపీ భూక్యా రాధ, భూక్యా సైదులు సమక్షంలో సమావేశమైతే వాళ్లు కూడా ఏకపక్షంగా తండావాసులకు అనుకూలంగా మాట్లాడటంతో ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లామని, ఆమె కూడా రెండు గ్రామాల ప్రజలు మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారని చెప్పారు. మొక్కంపాడులో ఏర్పాటు చేసిన జీపీ ఆఫీసుకు ఐదేళ్లుగా అద్దె చెల్లించడం లేదన్నారు.

ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే, ఎంపీపీల చుట్టూ తిరిగి విసుగు చెందినట్లు చెప్పారు. ఇప్పటికే కలెక్టర్, మండలాధికారులకు వినతిపత్రాలు అందజేశామని, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న మొక్కంపాడు గ్రామపెద్దలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు

అటెన్షన్ ప్లీజ్

అధ్వానంగా పారిశుద్ధ్యం..

టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. డ్రెయినేజీలు ఉన్నచోట సిల్ట్‌తో నిండి పోవడం, లేనిచోట మురుగు రోడ్డుపైకి, రోడ్డుపక్కనే పారుతూ నిల్వ ఉంటోంది. వీధులు చెత్తచెదారంతో కంపు కొడుతున్నాయి. హనుమాన్ గుడి ఎదురుగా పోల్ సెంటర్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఈగలు, దోమలు, క్రిమికీటకాలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీలు నిర్మించాలని, వీధుల్లో పారిశుద్ధ్యం పాటించాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : చిట్టి సిద్ధాంతి, పంచాయతీ కార్యదర్శి, బొమ్మనపల్లి
సెల్ నెంబర్: 9440322359